# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ రేపు సాయంత్రం 7 గంటల 15 నిమిషాలకు ప్రధానమంత్రిగా రాష్ట్రపతి భవన్ లో ప్రమాణస్వీకారం చేయనున్నారు.
- ❖ ఈనాడు గ్రూపు సంస్థల ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, బీజేపీ సీనియర్ నాయుకులు నరేంద్రమోదీ, పలువురు ప్రముఖులు తమ సంతాపం తెలియజేశారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 12న ప్రమాణ స్వీకారం చేయనున్నారు.
- ❖ జమ్ముకశ్మీర్ రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఉమ్మడి గుర్తు కోరుతూ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన దరఖాస్తులను తక్షణమే స్వీకరించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది.
- ❖ ప్రపంచ మహాసముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పునావికాదళం ఆధ్వర్యంలో ఈరోజు విశాఖలో బీచ్ క్లీనింగ్ నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ రేపు సాయంత్రం 7 గంటల 15 నిమిషాలకు ప్రధానమంత్రిగా రాష్ట్రపతి భవన్ లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, నరేంద్ర మోడీని ఆహ్వానించారు. కాగా ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి శ్రీలంక, మాల్దీవుల అధ్యక్షులు, బంగ్లాదేశ్, మారిషష్, నేపాల్, భూటాన్ దేశాల ప్రధాన మంత్రులు హాజరుకానున్నట్లు కేంద్ర ప్రభుత్వ విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈనాడు గ్రూపు సంస్థల ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు ఈ రోజు తెల్లవారు జామున హైదరాబాదులో మృతి చెందారు. ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన ఆయన మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతపాన్ని ప్రకటించారు. రామోజీ మరణంతో ప్రసార మాధ్యమాల రంగం, వినోద రంగం ఒక దిగ్గజాన్ని కోల్పోయిందని తన సంతాప సందేశంలో ఆమె

పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ రామోజీ రావు మృతికి సంతాపం తెలియజేస్తూ... రామోజీ రావు భారతీయ ప్రసార మాధ్యమాలలో విప్లమాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన దార్శనికుడని, ఎల్లప్పుడూ దేశాభివృద్ధి కోసమే ఆలోచించేవారిని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈ నెల 12వ తేదీ ఉదయం 11 గంటల 27 నిముషాలకు  ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ ఆ వివరాలను ఈరోజు వెల్లడించారు. గన్నవరం విమానాశ్రయం సమీపంలో ప్రమాణ స్వీకార వేదికలు ఖరారు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఈ మహోత్సవానికి దేశ ప్రధాన మంత్రితో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్న నేపధ్యంలో అన్ని శాఖల సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రాజకీయ ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనున్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ప్రమాణ స్వీకార వేదిక ఏర్పాట్లపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అద్నాన్ నయీమ్ అస్మి చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్ముకశ్మీర్ రాష్ట్ర శాసనసభకు జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఉమ్మడి గుర్తును కేటాయించాలని కోరుతూ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన దరఖాస్తులను తక్షణమే స్వీకరించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. సెప్టెంబరు 30లోగా జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీం కోర్టు గత ఏడాది డిసెంబర్ లో ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో రిజిస్టర్డ్, గుర్తింపు లేని పార్టీలు ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టడానికి ఒకే గుర్తు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చెరుకూరి రామోజీరావు మృతి పట్ల రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రగాంఢ సంతాపం తెలియజేశారు. తెలుగు జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడంలో ఆయన ప్రసిద్ధి చెందారని అన్నారు. తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు  రామోజీరావు మృతి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన సంతపాన్ని ప్రకటిస్తూ.. రామోజీ రావు తెలుగు వారి జీవితాల్లో ప్రభావ వంతమైన ముద్ర వేశారని, ఆయన మరణం రాష్ట్రానికే కాక, దేశానికి కూడా తీరని లోటని తెలిపారు. రామోజీరావు మృతికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి తన సంతాపాన్ని ప్రకటించారు. రామోజీరావు కుటుంబానికి  తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్  రామోజీరావు మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన స్ఫూర్తిని నవతరం పాత్రికేయులు అందిపుచ్చుకోవాలని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలో కుంటాం - తుమ్మగుడ్డి రహదారిలో నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి పనులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఈరోజు తనిఖీ చేశారు. అధికారులను పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే అరకులోని సుమారు 20 గ్రామాలు అనుసంధానమవుతాయని ఈ సందర్భంగా అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరంర మెట్టగుడ్డి మీదుగా 5 కోట్ల 75 లక్షల రూపాయలతో జరుగుతున్న రహదారుల పనుల్లో నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. వర్షా కాలం రానున్న నేపధ్యంలో పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ మహాసముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పునావికాదళం ఆధ్వర్యంలో ఈరోజు విశాఖలో బీచ్ క్లీనింగ్ నిర్వహించారు. భూమిపై జీవాన్ని నిలబెట్టడంలో సముద్రం యొక్క కీలక పాత్ర గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకే లక్ష్యంగా ఈకార్యక్రమం జరిగింది. అదేవిధంగా తీరప్రాంతం కోతకు గురికాకుండా రక్షించే మడ అడవులను పెంచే కార్యక్రమానికి నాందిపలుకుతూ మొక్కలు నాటారు. సముద్ర జీవులను హానికరమైన కాలుష్యం నుండి రక్షించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ.. తూర్పుతీర రాష్ట్రాలన్నింటిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నావికాదళ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ఎస్ వీరబాహు, ఐఎన్ఎస్ సర్కార్, నేవల్ డాక్ యార్డ్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు, నేవల్ డిఫెన్స్ సివిలియన్ సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈనాడు గ్రూపు సంస్థల ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు పార్థివ దేహానికి పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అఖండమైన తెలుగు జ్యోతి ఆరిపోయిందని అన్నారు. రామోజీ రావు మృతి తెలుగు జాతికి తీరని లోటని సిని నటుడు చిరంజీవి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ ఛైర్మన్ అదపాక సత్యారావు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. రాజకీయ, సిని ప్రముఖులు రామోజీ రావు మృతి పట్ల తమ సంతాపాలను తెలియజేశారు. అదేవిధంగా రామోజీ రావు అంత్యక్రియాలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 10వ తేదీ నుండి శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో యోగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు పలువురు యాగా గురువులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తెలియజేశారు. ఈ మేరకు నగరంలో ఈ రోజు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ ప్రపంచ వ్యాప్తంగా యోగాకు విశిష్టమైన గుర్తింపు తెచ్చారని కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బ్రిటిష్ కాలం నాటి సీఆర్పీసీ, ఐపీసీ, ఏవేడెన్స్ చట్టాలకు కేంద్ర ప్రభుత్వం సవరణ చేయడంతో కక్షిదారులకు త్వరిత గతిన న్యాయం లభిస్తుందని తిరుపతి జిల్లా సీనియర్ న్యాయవాది సుధాకర్ పేర్కొన్నారు. ఈరోజు తిరుపతి ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ.. ఈ ఏడాది జులై 1వ తేదీ నుండి సవరణ చేయబడిన ఈ చట్టాలు అమలవుతాయని అన్నారు. ఏళ్ల తరబడి న్యాయ స్థానాల చుట్టూ తిరుగుతూ.. ఇబ్బంది పడుతున్న కక్షిదారులకు సవరించబడ్డ చట్టాలు ఎంతగానో ఉపయోగపడ తాయని, న్యాయవ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల అధికారుల కృషి, సమన్వయం, సహకారంతో సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయగలిగామని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా జిల్లాలోని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఇతర జిల్లా అధికారులు ఈ రోజు జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల నిర్వహణలో సహకరించిన అధికారులందరికి ధన్యవాదాలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =